క్లుప్తంగా

శివాలయంలో ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ పూజలు



జువైనల్ జస్టిస్ బోర్డు ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ శిరీషను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభుశంభులింగేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం ఉమ్మడి జిల్లా జువైనల్ జస్టిస్ బోర్డు ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ కె.శిరీష ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆమెను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో బోర్డు సభ్యుడు మోహన్‌రావు నాయక్, ఈఓ శంభిరెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్ శర్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రుక్మారావుకు స్వర్ణనంది అవార్డు



స్వర్ణనంది అవార్డు అందజేస్తున్న కీర్తి ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, యశోద ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ నరాల రుక్మారావు చేసిన సేవలను గుర్తించిన కీర్తి అకాడమీ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయనకు జాతీయ స్వర్ణ నంది అవార్డును ప్రకటించింది. ఆదివారం హైదరాబాద్‌లోని సరస్వతి భవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేణుగోపాలచారి, దైవజ్ఞశర్మ, ఉమేష్‌చంద్ర, డాక్టర్ పద్మిని చేతుల మీదుగా రుక్మారావుకు అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు.

రక్తదానం గొప్పది



రక్తదానం చేస్తున్న యువకులు

కోదాడ : అన్నిదానాల కన్నా రక్తదానం గొప్పదని రాజయోగి బ్రహ్మకుమారీ త్రివేణి అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ మాజీ పరిపాలన అధిపతి దాది ప్రకాశ్‌మణి 18వ స్మృతి దినోత్సవం సందర్భంగా ఆదివారం కోదాడలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రివేణి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారి ప్రాణాలను నిలబెట్టే ఆప్తులు రక్తదాతలన్నారు. ఈ శిబిరంలో 29 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల వైద్యశాల నిర్వాహకురాలు డాక్టర్ ప్రమీల, బ్రహ్మకుమారీలు లక్ష్మి, జ్యోతి, పలువురు బ్రహ్మకుమారి సేవకులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా సూర్యనారాయణ



హుజూర్‌నగర్ : సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కొప్పోజు సూర్యనారాయణ ఎన్నికయ్యారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గాజుల రామారంలో శుక్రవారం జరిగిన పార్టీ రాష్ట్ర 4వ మహా సభలలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో, రైతు సంఘంలో తన శ్రమను గుర్తించి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకున్నందుకు సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి, రాష్ట్ర రైతు సంఘం నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు



నడిగూడెం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన ఆరోగ్య స్వస్థత కేంద్రం

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో తెలంగాణ ప్రభుత్వం-ఆయుష్ శాఖ నిధులు ఆరు లక్షల రూపాయల వ్యయంతో ఇటీవల ఆరోగ్య స్వస్థత కేంద్రం (హెల్త్ వెల్‌నెస్ సెంటర్) నిర్మించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఉదయం ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు అన్ని వయస్సుల వారికి ఆరోగ్య పరిస్థితులను బట్టి ఉచితంగా యోగాలో శిక్షణ ఇవ్వనున్నట్లు యోగా కోఆర్డినేటర్ బొడ్డు కుటుంబరావు తెలిపారు. ఆసక్తి ఉన్న రోగులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

బ్రిడ్జి నిర్మాణానికి మోక్షమెప్పుడో!

- వర్షాకాలంలో కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న వాగు నీరు
- భారీ వరదలొస్తే నేరేడుచర్ల-జాన్‌పహాడ్ మధ్య రాకపోకలు బంద్
- వాహనదారులకు తప్పని తిప్పలు



నర్సయ్యగూడెం వద్ద కల్వర్టు పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

నేరేడుచర్ల : భారీ వర్షాలు కురిసినప్పుడు నేరేడుచర్ల నుంచి జాన్‌పహాడ్ వెళ్లే మార్గంలో నర్సయ్యగూడెం సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద వాగు నీరు కల్వర్టుపై నుంచి ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వచ్చే వరదనీటితో పాటు పొలాల నుంచి వచ్చే నీటితో వాగు పొంగిపొర్లుతోంది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గుండా రాకపోకలకు సాగించే నేరేడుచర్ల, పాలకవీడు మండలాలకు చెందిన ద్విచక్రవాహనాలు, విద్యార్థులతో పాటు వివిధ పనులకు వెళ్లే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. జాన్‌పహాడ్ దర్గాకు వెళ్లే భక్తులు, డెక్కన్ సిమెంటు పరిశ్రమ కార్మికులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా కల్వర్టుకు ఇరువైపు రక్షణ గోడలు కూడా లేవు. దీంతో రాత్రి వేళ ద్విచక్రవాహనదారులు వరద ప్రవాహానికి ప్రమాదాల బారిన పడిన ఘటనలు కూడా ఉన్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. బిడ్జి నిర్మాణాలని ప్రజలు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కూడా ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇప్పటికైనా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు స్పందించి వాగుపై బ్రిడ్జి నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వాగుపై బిడ్జి నిర్మించాలి



జాన్‌పహాడ్- నేరేడుచర్ల రోడ్డులో నర్సయ్యగూడెం సమీపంలో వాగుపై గల కల్వర్టుపై వర్షాకాలంలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వివిధ పనుల నిమిత్తం నేరేడుచర్లకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు.. మంత్రి దృష్టికి తీసుకెళ్లాలి. బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి తక్షణమే పనులు ప్రారంభించాలి.

– తురక చలపతిరావు, దిర్శించర్ల

సత్యాగ్రహ దీక్షను జయప్రదం చేయాలి



హుజూర్‌నగర్ : సమావేశంలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఈ నెల 25న ఇందిరాపార్క్ వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేపట్టబోయే సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ధూళిపాల శ్రీనివాసరావు కోరారు. ఆదివారం పట్టణంలోని బీసీ భవన్‌లో నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలు రాజకీయంగా 14 శాతం, ఉద్యోగపరంగా 12 శాతం దాటలేదని, 60 శాతం ఉన్న బీసీలకు 79 సంవత్సరాలుగా అన్యాయం జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రావూరి ఇందిరమ్మ, చేపూరి నరసింహాచారి, యరగాని గురుస్వామి, కె.అశోక్, వి.మధు, సీహెచ్.అశోక్, కె.కృష్ణ, వి.శ్రీనివాస్, జి.శివ, కె.శేఖర్, కె.బ్రహ్మాచారి, శ్రీనివాస్, అఖిల్, శివ, ఆంజనేయులు, సైదయ్య, వెంకటేశ్వర్లు, నాగమణి, సీతమ్మ, సరస్వతి, సీతమ్మ, లలిత, సురభి వాణి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మునగాల : హైదరాబాద్‌లోని ఇందిర పార్క్ వద్ద సోమవారం రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించబోయే బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేవరకు బీసీల ఉద్యమం ఆగదని తెలిపారు. సత్యాగ్రహ దీక్షలో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చివేయాలి



మునగాలలోని పురాతన భవనం

మునగాల : మండల కేంద్రం నడిబొడ్డున పురాతన భవనం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. వైశ్య వీధిలో సుమారు వంద ఏళ్ల క్రితం ఈ రెండంస్తుల భవనాన్ని నిర్మించారు. కానీ గత రెండు దశాబ్దాలుగా యజమాని కుటుంబం ఆ భవనంలో నివాసం ఉండడం లేదు. దీంతో భవనంలో పిచ్చిచెట్లు మొలిచాయి. భవనం పాములు, విషపురుగులకు నిలయంగా మారింది. ఈ భవనం నుంచి తరచూ పాములు పరిసర ప్రాంతాలకు వస్తుండడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అంతేకాకుండా ఈ భవనం ఉన్న ప్రాంతంలో నిత్యం ప్రజల సంచారం ఎక్కువగా ఉంటుందని, ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనన్న భయంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. భవనం నిండా చెత్తాచెదారం చేరడంతో కంపు కొడుతోందని పరిసర ప్రాంత ప్రజలు అంటున్నారు. అధికారులు తక్షణమే శిథిలావస్థకు చేరిన ఈ భవనాన్ని నేలమట్టం చేయాలని కోరుతున్నారు. ఈమేరకు శుక్రవారం పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

గోడ కట్టారు.. దారి మూసేశారు!

- దారికి అడ్డుగా గోడ కట్టారని గిరిజన కుటుంబం ఆవేదన
- ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణ



ఇంటికి వెళ్లకుండా అడ్డుగా కట్టిన గోడ వద్ద గిరిజన దంపతులు

కోదాడ : నలభై సంవత్సరాలుగా తమ ఇంటికి రాకపోకలు సాగిస్తున్న రోడ్డుకు అడ్డంగా కొందరు గోడ కట్టి ఇబ్బంది పెడుతున్నారని, అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఓ గిరిజన కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. వివరాలు.. అనంతగిరి మండలం పాత గోల్‌తండాలో బోడ శంకర్ కుటుంబం 1-50 నంబర్ గల ఇంట్లో నివసిస్తోంది. అతని ఇంటి వరకు రోడ్డుతో పాటు దాని వెంట మిషన్ భగీరథ పైప్‌లైన్ కూడా ఉంది. అయితే ఐదు నెలల క్రితం ఇంటి పక్కన వారు ఆ రోడ్డుపై మొదట కంప వేసి మూసి వేశారని, దీంతో అనంతగిరి పోలీసులకు ఫిర్యాదు చేశామనిచ కానీ వారు పట్టించుకోలేదని శంకర్ ఆరోపించాడు. దీంతో ఇంటి పక్కన వారు రోడ్డుపై ఏకంగా గోడ కట్టారని తెలిపాడు. ఇంట్లోకి వెళ్లడానికి దారి లేక ఐదు నెలలుగా ఇతరుల ఇంట్లో ఉండాల్సి వస్తోందని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తన కుటుంబానికి న్యాయం చేయాలని శంకర్ దంపతులు కోరుతున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి కవితను వివరణ కోరగా బోడ శంకర్ ఇంటికి వెళ్లే రోడ్డు తమ రికార్డుల్లో లేదని, కానీ రోడ్డు వెంట మిషన్ భగీరథ పైప్‌లైన్, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ దారిలోనే శంకర్ కుటుంబం రాకపోకలు సాగిస్తున్నట్లు తెలిపారు. గోడ కట్టిన విషయమై బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, పోలీసులు అడిగిన వివరాలు చెప్పామని తెలిపారు. గోడ విషయంపై ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు.

పాఠ్యాంశాల్లో యోగా విద్యను చేర్చాలి



నాగేశ్వర్‌రావు, ఉపేందర్‌ను సన్మానిస్తున్న యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు

సూర్యాపేట : రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాల్లో యోగా విద్యను ప్రవేశపెట్టి ఆరోగ్య భారతాన్ని నిర్మాణం చేయాలని ముఖ్య డాక్టర్ దాచేపల్లి సుధీర్‌కుమార్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ స్పందన డిగ్రీ కాలేజీలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇటీవల ఆదిలాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొని నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించిన గూడూరు నాగేశ్వర్‌రావు, ఒక గోల్డ్ మెడల్ సాధించి జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన దేశగాని ఉపేందర్ ను వారు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జె. శశిధర్, మాజీ కౌన్సిలర్ బండపెల్లి పాండు రాగాచారి, అసోసియేషన్ కమిటీ ఉపాధ్యక్షులు సైదులు, పీడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దేశగాని శ్రీనివాస్, జుట్టుకొండ నవీన్, చంద్రశేఖర్, రంగారావు, బానుప్రకాష్, నాగిరెడ్డి,నగేష్, నామాల వీరయ్య, మల్లికార్జున్, భగవాన్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్‌వైర్లు సరిచేసిన ఆపరేటర్లు

హుజూర్‌నగర్ : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు అస్తవ్యస్తంగా ఉన్న ఇంటర్నెట్, కేబుల్ వైర్లను ఆపరేటర్లు ఆదివారం సరిచేశారు. కార్యక్రమంలో శాఖమూరి రవికుమార్, శ్రావణ్‌కుమార్, బోయినపల్లి నాగేశ్వరరావు, సతీష్, కిరణ్, చారి, తదితరులు పాల్గొన్నారు.

రంగనిగుడి ఆలయ ధర్మకర్త రంగయ్య మృతి



రంగయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రతినిధులు

కోదాడ : పట్టణంలోని అనంతగిరి రోడ్డులో గల గుంటిరఘునాథస్వామి (రంగనిగుడి) ఆలయ ధర్మకర్త గుడుగుంట్ల రంగయ్య (86) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్నకుమారుడు, భార్య గతంలో మరణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సహకార సంఘాల జోనల్ అధికారిగా ఆయన పనిచేశారు. కాగా, ఆయన మృతదేహాన్ని పలువురు పట్టణ ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోదాడ వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఎస్ఎస్.రావు మాట్లాడుతూ.. వంశపారపర్యంగా రంగనిగుడి ఆలయ ధర్మకర్తగా ఉన్న రంగయ్య ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆయన మరణం తీరని లోటని అన్నారు.

31న కోదాడలో మహాసభ

కోదాడరూరల్ : చేయూత పింఛన్లు పెంపుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 31 కోదాడలో నిర్వహిస్తున్న మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలకూరి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఆర్ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు, వీహెచ్‌పీఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలో మందకృష్ణ మాదిగ పాల్గొననున్నట్లు తెలిపారు. వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు, పూర్తి అంగవైకల్యం ఉన్న వారికి రూ.15వేల పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపూరి రాజుమాదిగ, కొండపల్లి ఆంజనేయులు, యలమర్తి రాము, విజయరావు, రావి స్నేహలతచౌదరి, ఏపూరి సత్యరాజు, పులి శ్రీనివాస్, రవి, రవీందర్ తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

చివ్వెంల(సూర్యాపేట) : స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి రెండేళ్లు అవుతున్నా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో పాలన గాడి తప్పిందన్నారు. కేంద్రం నిధులు రాకపోవడంతో పంచాయతీలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కలగాని సోమయ్య, ఇట్టమళ్ల ఎసోబ్, స్టాలిన్, సులేమాన్ పాల్గొన్నారు.

మాంసం విక్రయ దుకాణాల తనిఖీ



మాంసం దుకాణం తనిఖీ చేస్తున్న డాక్టర్ పెంటయ్య, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్

హుజూర్‌నగర్ : పట్టణంలోని మాంసం విక్రయ దుకాణాలను ఆదివారం ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కబేళాల్లో పశువుల వధ నిబంధనల అమలు, పరిశుభ్రమైన దుకాణాల్లో ఆరోగ్యకరమైన మాంసం విక్రయాలు, ప్రజారోగ్యంపై ప్రభావం అంశాలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గొర్రెలు, మేకలు, పశువులు, పంది, చేపల మాంసం విక్రయాలు నిర్వహిస్తున్న మొత్తం 46 దుకాణాలను తనిఖీ చేశామన్నారు. పట్టణంలో పురాతన మటన్ మార్కెట్ ఉన్నప్పటికీ పెరిగిన అవసరాల రీత్యా సరిపడా స్థలం, సౌకర్యాలు లేక నాలుగు షాపుల్లోనే మాంసం విక్రయాలు జరుగుతున్నాయని చెప్పారు. పట్టణంలో పశువధశాలలు లేకపోవడంతో ఇళ్ల వద్ద, రోడ్ల వెంట మేకలు, గొర్రెలను కోసి మాంసం విక్రయిస్తున్నారన్నారు. వసతులపై, తనిఖీలో గుర్తించిన అంశాలను జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి ద్వారా జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ శానిటరీ జవాన్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగుల సమస్యలపై ఉద్యమిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న రావెళ్ల సీతారామయ్య

నడిగూడెం : రిటైర్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం చేపట్టనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రిటైర్డు ఉద్యోగుల సంఘం మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా పీఆర్‌సీ అమలు చేయడం లేదని, ఇప్పటివరకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తక్షణమే రిటైర్డు ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు మాట్లాడుతూ.. రిటైర్డు ఉద్యోగుల సంఘం సామాజిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బండారు నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా ఎండి.ఖలీల్ అహ్మద్, కార్యదర్శిగా లావూరి బాలాజీ, కోశాధికారిగా ఎండి.ఇబ్రహీం, అసోసియేట్ అధ్యక్షుడిగా అలుగుబల్లి అప్పిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా తూము వెంకటేశ్వరరావు, చిలకల స్వరాజ్యం, సంయుక్త కార్యదర్శిగా వేపూరి రాములు, కార్యనిర్వాహక కార్యదర్శిగా దున్నా అంజయ్య, ప్రచార కార్యదర్శిగా గుండు అనంత రాములు, మరో 10 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

'సురవరం' మృతి పార్టీకి తీరని లోటు



సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

చిలుకూరు : మాజీ ఎంపీ, సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పలువురు సీపీఐ నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఐ భవన్‌లో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సురవరం సుధాకర్ రెడ్డి ఆదర్శప్రాయుడని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి సాహెబ్ అలీ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, సీపీఐ నాయకులు చిలువేరు ఆంజనేయులు, పిల్లుట్ల కనకయ్య, మండవ అచ్చయ్య, కస్తూరి సైదులు, ముక్క లక్ష్మీనారాయణ, పాలేబోయిన గంగాధర్, బాలేబోయిన రవి, అనంతుల రాము, కొల్లు నాగేశ్వరరావు, వీరబాబు, వీరస్వామి, జానీ, చంద్రయ్య, మౌలానా, తిరుమలరావు, రెమిడాల రాజు, రామిశెట్టి కోటయ్య, రవీందర్‌రెడ్డి, కనకరావు, ముత్తారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



మోతె : సిరికొండలో బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న గ్రామస్తులు

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డ గ్రామంలో ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను తలపై ఎత్తుకొని మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు చీర, సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

సిరికొండలో..

మోతె : మండలంలోని సిరికొండ గ్రామంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మతో పాటు గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నాయకులు కుప్పరాజు సతీష్‌బాబు, కృష్ణారెడ్డి, వెలుగు వీరన్న, బొర్ర మధుసుదన్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చౌటపల్లిలో..



మఠంపల్లి : చౌటపల్లిలో..

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో ఆదివారం ముత్యాలమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు బోనాలను తలపై ఎత్తుకొని డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. కోళ్లు, మేకలు బలిచ్చి గ్రామ దేవతలకు నైవేద్యంగా సమర్పించారు. ముందుగా బొడ్రాయి, గ్రామ దేవతలైన అంకమ్మ, మద్దిరావమ్మకు పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : బూరుగడ్డలో..

రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం

- చిత్తడిగా ఆర్లెగూడెం రోడ్డు
- రాకపోకలకు ఇబ్బందులు



చిత్తడిగా ఆర్లెగూడెం రోడ్డు

చిలుకూరు : మండల కేంద్రం నుంచి ఆర్లెగూడెం, కొత్త కొండాపురం వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. గుంతలమయంగా మారింది. సుమారుగా మూడు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డు పలు చోట్ల కంకర తేలి ప్రమాదకరంగా ఉంది. అంతేకాకుండా రోడ్డు ఇరు పక్కల ఆక్రమణకు గురికావడంతో వెడల్పు తగ్గి ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే పక్కకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల ఉపాధి హామీ పథకం కింద కూలీలతో రోడ్డుపై మట్టి పోయించడంతో వర్షానికి చిత్తడిగా మారింది. రోడ్డు వెంట చిలుకూరు, ఆర్లెగూడెం, పాత కొండాపురం గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఉంటాయి. ప్రస్తుతం సాగు పనులు మొదలు కావడంతో రైతుల రాకపోకలతో రోడ్డు రద్దీగా ఉంటోంది. పొలాలకు ఎరువుల బస్తాలు తీసుకెళ్లడానికి, పచ్చిగడ్డి మోపులు తీసుకురావడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. వరినాట్లు, వరి కోతల సమయంలో ట్రాక్టర్లు, వరి కోత మిషన్ల రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు. చిలుకూరు నుంచి ఈ రోడ్డు గుండా ఆర్లెగూడెం, కొత్త కొండాపురం మీదుగా ముక్త్యాల బ్రాంచ్ కెనాల్, పాత కొండాపురం, మాధవగూడెం గ్రామాలకు వెళ్లవచ్చు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా నేటికీ ప్రయోజనం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం



చిలుకూరు నుంచి పాత కొండాపురం, ఆర్లెగూడెం వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో రాకపోకలకు రైతులందరం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. రోడ్డుకు మరమ్మతులు చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– పిల్లుట్ల రమేష్, రైతు, చిలుకూరు